

# కథా కౌముది

## చర్విత చర్వణం డా.దొరల విజయ కుమారి



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

నా అనుభవాలు తనతో సరిచూసు కుంటుంటాను బేరీజు వేసుకుంటుంటాను. కాలాన్ని తానెలా కొలుస్తాడో చూస్తే ఆశ్చర్యం ఆనందం కలుగుతుంది. నేను రోజులంటాను.. తాను అనుభూతులంటాడు.

“ఒక ఇంద్రధనుస్సును చూస్తే నువ్వేం చేస్తావు?” అని అడుగుతాడు..లేదా “నేలపై నడుస్తున్నపుడు నీకే మనిపిస్తుంది?..ఎదురుగా ఉన్న ప్రకృతిలో ఏం చూసావు?..బాల్యాన్నంతా ఖర్చు పెట్టేసుకున్నావా, ఇంకా ఉందా?..ఇపుడు నీ దగ్గర ఏం మిగిలింది నీకు తెలుసా?”..అంటూ ఏవో ఒకటి అడుగుతూనే ఉంటాడు.

ఇప్పుడే జీవితం మొదలైనట్టుంది. కానీ వేగంగా ఎక్కడికో కొట్టుకు పోతున్నట్టుగా ఉంది. తాను పరిచయం అయ్యాక మరీ వేగంగా. అసలేం జరుగుతోంది నా మనసు గ్రహించే లోగా ఎన్నో సందర్భాలను మోసుకుంటూ వచ్చేస్తోంది కాలం. ప్రతి సందర్భంలోనూ తానున్నాడు అనేకంటే తాను లేని సందర్భమే లేదేమో. ఈమధ్యనే నేను గ్రహించాను నా ఎద అంతర్లీనంగా కోరుకుంటున్నదీ అదే..!

"నిన్ను ఎప్పుడూ ఏదో ఒక గిన్నెలోకి పోసేసుకుంటావ్..అందులో నీ ప్రమేయం లేకుండానే.. ఎందుకలా..?" అని మళ్ళీ తనే..

“అనుభవాలకు అనుభూతులకు ఎప్పుడూ ఏదో ఒక కొలబద్దను నిర్ణయించే అధికారం మనిషికి లేదు. అదంతా కాలం చూసుకుంటుంది" అంటాడు.

"అదేంటి అనుభవాలను ఎన్ని నింపుకోవాలో, ఎలాంటివి నింపుకోవాలో మన చేతిలో పనే కదా" అని నేను అంటే,

"నిజమే..కానీ ఎంత ఎలా అన్నది కాలం నిర్ణయిస్తుంది" అంటాడు.

అయోమయంగా అనిపిస్తుంటే..మౌనంగా అయిపోతుంటాను. ఒక సారి

"స్ఫూర్తి..! ఒక విషయం చెప్పు" సడెన్ గా గంభీరంగా అడిగాడు. అడగమని తల ఊపాను

"నీకు స్వేచ్ఛ ఉందా?" నేను ఆశ్చర్యపోయాను. నిజానికి సమాధానం ఏం చెప్పాలో కూడా నాకు తెలియదు. కొన్ని సెకండ్లు నా వైపు చూసి..

"సరే ఉంటాను" అనేసి వెళ్ళిపోయాడు.

వెంటనే ఒక టెక్స్ట్ మెసేజ్

"నీకు స్వేచ్ఛ లేదనే సత్యం నీకింకా తెలియదు. ఎంత విషాదం" అని ఉంది. నాకు చాలా కోపం వచ్చింది. వెంటనే మరో మెసేజ్

"నువ్వు ద్రవపదార్థమా?..ఘనపదార్థమా..

వాయురూపమా..? నిన్ను ఎత్తి పెడుతున్నారా?

ఏ పాత్ర లోనో పోస్తున్నారా.. ? పట్టి నింపుతున్నారా?"

అలాంటి మెసేజ్ లు..అతని మాటలు..ఆలోచనల పిచ్చితో నాకు పిచ్చి పట్టేలా ఉంది. ఇక తనతో మాట్లాడరాదు అనుకుని రూంకు వచ్చేస్తాను.

మళ్ళీ మామూలే. ఏదో అడుగుతాడు..నేను ఒకటి చెబుతాను..తాను మరేదో చెబుతాడు.. వివరిస్తాడు..విసిగిస్తాడు. అతను అడిగే విధానం..చెప్పేవిధానం హర్టింగా ఏమీ ఉండవు. ఎగతాళి అస్సలు చేయడు. అయినా నాకే కోపం వస్తుంది..అసలది కోపమో కాదో నాకే తెలియదు. రోజురోజుకూ ఒకటే తెలిసింది..

ఈ స్నేహాన్ని అస్సలు వొదులుకోలేనంతగా అలవాటు పడిపోతున్నానని. కాదు తానే నన్ను అలవాటు చేసేస్తున్నాడు.

"నీకు నువ్వు..మరొకరికి సహాయ పడగలవా?" అని అడుగుతాడు

బొత్తిగా తెలియని ఆసక్తిలేని విషయాలను సైతం అలవోకగా నాకు అవగతం చేయిస్తాడు. రోజులో చాలా భాగం అతనే ప్రశ్నిస్తాడు. జవాబులూ తానే చెబుతాడు. నేను ప్రశ్నలను విసురుతున్నపుడు అతను చిరునవ్వును పులిమిన జవాబులను తిరిగి నాకేసి విసురుతాడు.

నా ఆలోచనల్లోకి తనవైన అర్థాలను పొందు పరచడం నాకు తెలియకుండా నా అనుమతి తీసుకోకుండా చేసేయడం చాలా విస్మయానికి గురిచేస్తుంది. చిరుకోపమూ వస్తుంది.

అదే విషయాన్ని తనకు చెబితే అంతే చిరు నవ్వుతో

" విస్మయం దేనికో చిరుకోపం దేనికో చెప్పమ"నే వాడు.

నాకేమో బిడియంగా అనిపిస్తుంది. మొదట్లో చెప్పేసే దాన్ని తర్వాతే తెలిసొచ్చింది నా గూర్చి అతనికి తెలిసిపోతోందని. అందుకే ఈమధ్య కొంచెం జాగ్రత్త పడ్తున్నాను. అయినా అంతా చెప్పేస్తే ఎలా..కొంచెమైనా దాచుకోవాలి. నాగూర్చి తనకు కాస్త సస్పెన్స్ ఉండాలని నా కోరిక. అది థ్రిల్లింగ్ గా కూడా ఉంటుందని నా అభిప్రాయం.

ఒకరోజు ఏదో ఒక మెసేజ్ చూస్తూ 'అడీక్వసీ.. ప్లెంటీట్యూడ్' గూర్చి అడిగాను తన మీనింగ్ ఏంటో చెప్పమని

"అడీక్వేట్ గా ఉన్న పెర్సన్ ఇతరులను తక్కువగా చూడదు. ఎక్కువగానూ అనుకోదు. తాను తనకు చాలినంతగా అనుకుంటాడు. అయినదానికీ కాని దానికీ ఎవరిమీదకూ ఎగబడిపోడు. తనకంటూ ఒక నిశ్చితాభిప్రాయం ఉంటుంది. వాళ్ళకు చాలా తక్కువ మంది ఫ్రెండ్స్ ఉంటారు. రోజూ స్నేహితులతో మాట్లాడకపోయినా.. కబుర్లు చెప్పుకుని షేర్ చేసుకోకపోయినా సరే కనెక్ట్ అయ్యే ఉంటారు. అడీక్వేట్ గా ఉన్న వాళ్ళను చూస్తే పై అధికారుల కు భయం అసూయ..కుళ్ళు. అందుకోసం వాళ్ళనే టార్గెట్ చేయడమే పనిగా పెట్టుకుంటారు. మిసరబిలిటీ ఏంటంటే..ఆ అడీక్వేట్ గా ఉన్న వ్యక్తులపై ఈ కక్ష్య సాధింపు చర్యలకే ఆ సదరు అధికారులు వాళ్ళ విలువైన సమయాన్ని వృదా చేసేసుకుంటారు."

చెప్తున్న తననే తదేకంగా చూస్తుంటే నన్ను గమనించి మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాడు

"ఒక రాత్రి ఒక ఉదయం ఒక సాయంకాలం ఎన్ని అద్భుతాలను దాచుకుని ఉంటుందో అలా ఉంటాడు అడీక్వేట్ గా ఉన్న వ్యక్తి. తనకు స్నేహితులుగా ఉన్నవాళ్లు తనలో కొన్ని అద్భుతాలను సిట్యుయేషనల్ గా చూసే ఉంటారు..అందుకే స్నేహితులకు తాను అపురూపమే. అతను ఎవరికీ సొంతం ఆవిష్కృతం కాడేమో. ఆఫ్ కోర్స్ ఎవరూ వాళ్ళను వాళ్ళు పూర్తి గా ఆవిష్కరించుకోలేరు. అసలు జీవితం అన్ని అవకాశాలను ఎవ్వరికీ ఇవ్వలేక పోవచ్చు"

"ఇన్ని చెబుతుంటే అలాంటి వ్యక్తిని చూడాలని కలుసుకోవాలనీ అనిపిస్తుంది" తననే చూస్తూ అంటుంటే..చిరునవ్వుతో

"ఏదో ఒక రోజు జీవితం ఏ మలుపులోనో మైదానంలో నో కలుసుకుంటావు లే" అన్నాడు.

ఒక్కరోజు తాను ఆలస్యంగా వచ్చినా..కనబడక పోయినా మనసు తల్లడిల్లి పోతుంది. నా మనసు నన్ను ప్రశ్నిస్తోంది ..దీన్నేమంటారు ? అని.

ఇతని వైపుకు ఎందుకని మనసు మొగ్గు చూపుతోంది అని నన్ను నేను చాలాసార్లు ప్రశ్నించుకున్నాను..సరైన సమాధానం దొరకలేదు. నన్ను తనవైపుకు అంతగా ఆకర్షించడానికి అతని విస్తారమైన విజ్ఞానం కావచ్చు..సమయస్ఫూర్తి కావచ్చు..సహనం..సంయమనం ఎవైనా కావచ్చు. నాకు అతని సమక్షం కావాలి. నాకేం కావాలో నాకేం కొదువగా ఉందో

నాకంటే నా గూర్చి అతనికే ఎక్కువ తెలుసు. నాలో తాను ఏం చూసాడో తెలియదు కానీ నేనంటే చాలా ఇష్టము శ్రద్ధ కనబరుస్తాడు.

చీకటి పొద్దులకు వెలుగు సూత్రాలను నేర్పుతాడు.

ఆ ప్రేమానుభూతిని ఎప్పటికీ మర్చిపోలేనని స్వయంగా ప్రకటిస్తుంది మనసు. వేలి ముద్రల్లా..

తన ప్రేమ ఎవరితోనూ పోల్చదగినది కాదు. ఈ ప్రేమను సొంతం చదవలేను. ఒక్కోసారి అంతా తెలిసిపోయినట్టు..ఒక్కోసారి అసలేం తెలియనట్టు..అనిపిస్తుంది. ఇక నేను చేసింది.. చేయాల్సింది..చేయబోయేది అంతా అయోమయంగా అనిపిస్తూ..పూర్వాపరాలు ఆలోచించలేని స్థితిలో ఉన్నట్టనిపిస్తుంది.

ఎన్నడూ అనుకోనివన్నీ అనుభూతి చెందేలా..ఎద ఏవో రాగాలు తీసేలా నా గుండెకు గురువై గమకాలను నేర్పుతాడు. అయినా ఈ కవ్వింపు నుంచీ తప్పించుకున్న వారెవరు..? ఈ లోతులనుంచీ బయట పడ్డవారెవరు..? ప్రేమ జోలికెళ్ళకుండా..తిన్నగా నడిచి వెళ్ళిన వారెవరు..? ఈ ఇష్టాన్ని పొదిగేందుకు పదాలు లేవు అనువదించేందుకు అక్షరాలు చాలవు. అదేంటో వాక్యాలను సందర్భాలను తనే కూర్చు కుంటుంది మదిలో ఓ ప్రేమ కావ్యమై కూర్చుంటుంది.

ఈ ప్రణయం ఏం చెబుతుందో..అట్టే ఆకట్టుకుంటుంది. ఏమీ చెప్పకనే అర్థమైపోతుంది. ఒకసారి ఎంత చెప్పినా..మళ్ళీ మొదలెట్ట మంటుంది. ఏ భాషలో నైనా సరే మాట్లాడేస్తుంది. తనను చూస్తే ఏమడగాలో ఆదమరుస్తుంది. ప్రేమ గూర్చి ఎవరితోనైనా చర్చిస్తే బాగుండు. ఎలా ఎప్పుడు మొదలైందో.. మెరుగులు దిద్దుకుంది కొనసాగుతోంది..కాస్తైనా అంతుచిక్కదు ఈ ప్రేమ భాషను తర్జుమా చేయడం అంత సులభమైన విషయమేమీ కాదు.

తన రాక ఒక మైలు రాయి. దారి తెన్నులు లేని నా ప్రయాణం లో వెతుకులాడి పరితపించాక తానొచ్చాడు. తానొచ్చాకే నాకు వర్షించడం తెలిసింది..ప్రవహించడం తెలిసింది..తన ఎదుట మనసును విప్పేయడం తెలిసింది..భావాల్ని పేర్చుకోవడం తెలిసింది..గరుకుగా గుచ్చుకుంటున్న జ్ఞాపకాలను పూలలా మార్చేసుకోవడం తెలిసింది. హృదయాంతరాల్లో మొదలైన అలజడిని పరిమళంలా చేసి ఒళ్ళంతా పులుము కోవడం తెలిసింది. సంకోచాల్ని సందేహాల్ని ఉండచుట్టి ఎగరేసి..అశాంతి పవనాల్లోనూ సేదదీరుతూ బతికేయడం తెలిసింది. నా వెతల భావాల పదాల్ని మార్చి ప్రేమ గీతాన్ని రచించుకోవడం తెలిసింది. కాలం పరాచికాలను తెలియనట్లుగా చేసుకుని నా కోసమే మిగిలి ఉండడం తెలిసింది. ప్రతి నిమిషం జీవించడం తెలిసింది. ప్రతి ఘడియ అది మంచిని తెచ్చినా చెడును ఇచ్చినా ప్రేమగా నిమరడం తెలిసింది. అతనితో ఇలాగే సాగిపోతే ఇంకా ఏమేం తెలుసుకుంటానో..!

అదను చూసి తన అనురాగం కురుస్తుంటే..

ఇప్పుడు మనసు క్షేత్రం నిండుగా..సుభిక్షంగా పచ్చదనాలు పూలు..ఫలాలు. తన మమతల మల్లెమొగ్గలు పగిలినపుడల్లా ప్రేమ పుప్పొడి వెదజల్లబడ తుంది. నా భావాలు కొన్ని మళ్ళీ విత్తబడి..మొలుస్తూ..పెరుగుతూ..ఏనాటికైనా మధురమైన ప్రేమ ఫలాలు..మా కోసం కాస్తాయన్న ఆశతో..నేను.

నాలో ఇన్ని ఫీలింగ్స్ సుళ్ళు తిరుగుతూంటే తానేమో అస్సలు బయట పడడు. అక్కరగా ఉంటాడు అన్నీ చూసుకుంటాడు కానీ హద్దుమీరడు. ఒక్కసారైనా 'నన్ను తాకాలని దగ్గరికి తీసుకోవాలని' ఎందుకనుకోడు. అడిగేద్దాం అనిపిస్తుంది మళ్ళీ ఏమౌతుందో నని భయమేస్తుంది.

అందరూ చెప్పుకున్నట్టు గా' నేను నిన్ను ప్రేమిస్తున్నాను, నువ్వంటే నాకిష్టం ' అని ఏనాడు చెప్పలేదు. కానీ నాన్ వెర్బల్ క్యూస్ .. ఫేషియల్ ఎక్స్ ప్రెషన్స్..గెస్చర్స్ .బాడీ లాంగ్వేజ్ ను బట్టి నేనంటే ఎంతో ఇష్టమని తెలుస్తుంది.

ఒక్కసారి అనిపిస్తుంది మా మధ్య ఈ రిలేషన్ కు 'ప్రేమ' అని ఒక డెఫినిషన్ ఎందుకులే..

తాను దగ్గరుంటే చాలు.. తనని రోజూ అలా చూస్తుంటే చాలు అని.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

వీకెండ్ లో ఊరికి దూరంగా ఉన్న గుట్టపైకి వెళ్ళాం. అక్కడ మా లాగే చాలా మంది ఉన్నారు. అక్కడ ఒక పురాతన ఆలయం ఉంది. చుట్టూ గోడ. ఏ కారణం చేతనో గేట్ మూసేసి ఉంది. అందరూ నిక్కి ఎక్కి చూస్తున్నారు. ఒక అబ్బాయి ఒక అమ్మాయిని ఎత్తి పట్టుకుని చూపిస్తూ వివరించి చెబుతున్నాడు. నాకా దృశ్యం చాలా నచ్చింది. ఎంత ప్రేమ అతనికి. అలా ఉండాలి అని అనుకుంటుండగానే.. సడెన్ గా నేను గాలిలోకి లేచాను. ఏం జరుగుతుందో తెలిసేలోగా.. ఎత్తి పట్టుకున్న అతని బలిష్టమైన చేతుల్లో నేను

" ఇప్పుడు చూడు బాగా కనిపిస్తుంది" అని చెబుతున్నాడు. నాకేమో ఏదో మైకం కమ్మినట్టుగా కళ్ళు మూసుకుని పోతున్నాయి. ఆ స్థితి బాగుంది. అయినా చిరు కోపం ప్రదర్శించాను.

"ఏంటిది సూరి?" అనగానే..

తాను మాత్రం అదే తరహా చిరునవ్వుతో దింపేసాడు..నీ కథ ఏమిటో నాకు తెలుసులే అన్నట్లుగా. నిజమే నన్నూ అలా ఎత్తుకుని చూపిస్తే ఎంత బాగుంటుంది అనుకునే లోగా తానే నన్ను ఎత్తుకుని చూపించాడు. ఆ అనుభవం చాలా బాగుంది. అయినా చిరుకోపం అభినయించాను తాను అదేం పట్టించుకోకుండా

"ఏముంది నువ్వు ఆ అమ్మాయిని చూస్తున్నావు నీకూ అలాంటి ఇష్టం ఉందని గ్రహించే అలా ఎత్తుకుని చూపించాను" అన్నాడు.

"అవును పాపం అన్నీ తెలిసిపోతాయి. నువ్వు పెద్ద మహిమాన్వితుడివా..నా మనసులోని వన్నీ తెలుసుకోవడానికి" ఇంకా కాస్త మొండిని ప్రదర్శించాను.

తాను అదేదీ పట్టించుకోకుండా "సరే వెళ్దాం పద" అంటూ కిందికి బయల్దేరాడు. నాలో ఎందుకో ఆశాభంగం..ఇంకా ఇంకా అతనికి దగ్గరైపోవాలన్న కోరిక అంతర్లీనంగా ఎప్పుడో ఎక్కడో పిల్లకాలవలా మొదలై అంతర్వాహిని లా ప్రవహించడం మొదలుపెట్టింది.

నేనో పెద్ద జడ పదార్థాన్ని అంటారు ఫ్రెండ్స్. కాలేజ్ లో ' మిస్ కోల్డ్ స్ఫూర్తి ' నా నిక్ నేమ్. మరి ఇదేంటి లా రోజు రోజుకూ..కరిగిపోతున్నానా..నాకు బాగుంది అయినా బాగోలేదని చెప్పమంటోంది మనసు. ఎవరైనా నన్ను ఏమైనా అనుకుంటా రేమో అని బయట పడొద్దని చెబుతోంది..

కిందికి దిగి వచ్చేసాం. ఎంత సేపు వెయిట్ చేసినా క్యాబ్ దొరకలేదు. ఆటోలు రావడం లేదు. ర్యాపిడ్ అక్కడికి కనెక్ట్ అవడం లేదు. చలి మొదలైంది.

ఏం చేయాలి అని అనుకుంటూ ఉంటే ఒక షేర్ ఆటో వచ్చింది అది అప్పటికే నిండుగా ఉంది.. అయినా 'ఎక్కండి సార్' అని అంటున్నాడు. సూరి నా వైపు చూసాడు 'ఏం చేద్దాం' అన్నట్టుగా నా ముఖం లో ఏం కనిపించిందో ' స్ఫూర్తి రా ఎక్కు' అని ఆటో దగ్గరికి తీసుకువెళ్ళి నన్ను ఎక్కించి తాను ఎక్కేసాడు. సైడ్ రెయిల్ మీద ఇద్దరు..మేం కూర్చున్న సీట్లో మాతో కలిపి నలుగురు..ఎదురు సన్న చెక్క సీటులో మరో ముగ్గురు పెద్దవాళ్ళు ఇద్దరు చిన్నారులు. డ్రైవర్ కు చెరో వైపు ఒక్కరు.

సీట్లో మగవాళ్ళున్నారని నన్ను డోర్ వైపు కూర్చోపెట్టి తాను మధ్యలో కూర్చున్నాడు.

శీతాకాలం రాత్రి. సమయం గడిచేకొద్దీ చలి ఎక్కువౌతోంది. సూరి నేను చాలా చాలా దగ్గరగా కూర్చోవడం ఇదే మొదటిసారి. ఒకరి ఊపిరి ఒకరికి వెచ్చగా తగిలేంత దగ్గరగా ఉన్నాం. తనలో ఏం జరుగుతుందో తెలియదు కానీ నాలో ఏదేదో జరుగుతోంది. మునుపెన్నడూ లేని కోరికలు.. ఇష్టాలు. అసలు అలాంటి కోరికలు నాలో ఇంత బలంగా ఉన్నాయని నాకు తెలుస్తున్నది ఇప్పుడిప్పుడే.

పుస్తకాల్లో పత్రికల్లో వచ్చే 'సరసమైన కథల్లోనూ ' సినిమాల్లోనూ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ కుదిరింది అని రాస్తుంటారు..చెబుతారు ఇదేనేమో.. అదే..అని అవునని పిస్తోంది. అయితే మా మధ్య కెమిస్ట్రీ ఉన్నట్టే..అనుకుంటే సంతోషమైంది.

ఆటోలో ఉన్నవాళ్ళు అందరూ తూగుతూ ఉన్నారు. ఆటో కుదుపులకు ఇంకాస్త దగ్గరైపోతున్నాం. నాకైతే చాలా బాగుంది. మనసులో మొదలైంది ఏదో తరంగం దేహమంతా అలుముకుంటోంది. అదేదో దేహానికి కావాల్సిందేదో పొందేంతదాకా ఆగేలా లేదు. సూరి ఏదైనా చేస్తే బాగుండు అని తిక్క తిక్క కోరికలు. కనీసం ముద్దయినా పెడితే బాగుంటుంది. కానీ అతనేమీ పట్టించుకోవడం లేదు.

పోనీ సూరిని " నువ్వు ఎలా ఫీల్ అవుతున్నావు?" అని నేనే అడిగేస్తే..అలా అడిగేందుకు చాలా మొహమాటంగా బిడియంగా ఉంది.

ఇలాంటి పరిస్థితులను అర్థం చేసుకోనందుకు

“అయ్యో దేవుడా ఇంత మొద్దబ్బాయిని ఇచ్చావేంటయ్యా?” అని గట్టిగా అరవాలని పిస్తోంది. సూరి పైన కోపం వస్తోంది. అన్ని తెలివితేటలు ప్రదర్శిస్తాడు. నేనేమీ చెప్పకనే నన్ను పూర్తిగా చదివేస్తాడు. ఈ ఫీలింగ్స్ ను ఎందుకని తెలుసుకోడో.

ఆడవారు ఇలాంటి విషయాలలో త్వరగా బయటపడలేరేమో.. బయటపడకుండా బెట్టు చేయడం వారి హక్కు. సూరి బుర్రకున్నంత పదును ఆ మనసుకు శరీరానికి ఉన్నట్టు లేదు. ఇంతగా ప్రేమిస్తున్నాను తాను ఏదడిగినా ఇచ్చేందుకు సిద్దపడిపోయాను. అలా అనుకుంటేనే కదా తనతో ఇలా ఎక్కడికైనా వస్తున్నది. అర్థం చేసుకోడు. నిజంగా ముద్దపప్పు తాను.

అయినా నేనే ఎందుకు బయటపడాలి. నాకేనా తనకేమీ వద్దా. అవమానం గా ఉంది. “ఛ..ఛ అంత మాత్రం కంట్రోల్ చేసుకోకుంటే నేను స్ఫూర్తి నే కాను”

చాలా ఉక్రోషంతో కొంచెం దూరంగా జరిగాను.

అంతే..మరో సెకండ్ లోనే నా చుట్టూ తన కుడిచేతిని వేసి దగ్గరగా పొదుపుకున్నాడు. నాకు చెప్పలేని ఆనందం కలుగుతుంటే అడిగాడు.

"చలిగా ఉందా?" అని

అవునని తల ఊపాను. కాసేపు అటూ ఇటూ చూసి నా పెదవులపై తన పెదవులను ఆనించి చటుక్కున తీసేసాడు. నా కళ్ళు మూత పడ్డాయి.

"చలి తగ్గిందా?" నా చెవిలో గొణిగాడు

నేనేమీ మాట్లాడలేదు.

"త్వరలో తగ్గిస్తానులే " అని చెవిలో గుసగుసగా అన్నాడు.

"చీ నీకు సిగ్గులేదు " అని తనని చిన్న దెబ్బ వేసాను.

"ఇద్దరిదీ కలిపి నీకుంది చాల్లే "అన్నాడు.

"తమరి లో ఈ యాంగిల్ కూడా ఉందా?" అంటే,

"ఏం నా జెండర్ పైన అనుమానమా?" అని సాగదీసాడు.

ఈ ఒక్క కౌగిలి కోసం..ఈ పెదవుల లాలన కోసం ఎంతగా తపించాను. మనసు నెమ్మదించింది. ఎంతో అల్ప సంతోషి నా హృది. అంత ఇరుకులోనూ అతనితో మనసు హాయిగా అడుగులేస్తున్నట్టుంది. కళ్ళు మూసుకుని అతని వెచ్చని సమక్షం లో నిశ్చింతగా ఉండిపోయాను.

ఏదో పెద్ద కుదుపుతో ఆటో ఆగింది. ఏం జరుగుతుందో తెలిసే లోగా.. సూరిని లాగి కిందపడేసారు

"జా..తక్కువ నా కొ..కా పెద్దింటి అమ్మాయి కావాలా నీకు?" పిడిగుద్దులు గుద్దుతున్నారు

కాలితో తంతున్నారు. నాకు అర్థం అయింది.. తేరుకుని అడ్డుపడ్డాను.

"సూరిని కొట్టకండి అతనంటే నాకు ప్రాణం" ఏడుస్తూ చేతులు జోడించాను.

"అమ్మ మీరు పక్కకు రండి ఇది అయ్యగారి ఆజ్ఞ"

వాళ్ళలో ఒకడికి ఫోనొచ్చింది, వాడు "సరే అయ్యా..సరే అయ్యా" అన్నాడు.

వాడు సైగ చెయ్యగానే వెంట తెచ్చుకున్న రాడ్ తో సూరి తలపై మోదాడు..నేను స్పృహ కోల్పోయాను. తర్వాత కళ్ళు తెరిస్తే ఇంట్లో ఉన్నాను. నేనేం అడిగినా ఎవ్వరూ నోరు మెదపలేదు. నన్ను దాదాపుగా బందీని చేసారు.

నా కన్నీళ్ళకు ఎవరూ సమాధానం చెప్పలేక పోయారు. ఈ తక్కువ బుద్ధి వాళ్ళను వదిలి దూరంగా వచ్చేసాను. ఎంతెంతో ప్రయత్నిస్తూనే ఉన్నాను. సూరి ఎక్కడ ఉన్నాడో..ఎలా ఉన్నాడో.. అసలు ఉన్నాడో లేదో..అనుకుంటే కన్నీళ్లు ఆగవు.

ఈ బాధ తీరలేదు. ఇక్కడున్నా ఎక్కడున్నా..

నా మనసులో నాతోనే ఉన్నాడు.

★★★★★★

COMMENTS